క్లుప్తంగా

సలహాలు, అభిప్రాయాలు తెలపండి


మాట్లాడుతున్న కూర్మనాథ్

వెంకటాచలం: ఓటర్ల జాబితాకు సంబంధించి జరుగుతున్న ఇంటింటి సర్వే, పోలింగ్ బూత్‌ల క్రమబద్ధీకరణ తదితరాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు వారి సలహాలు, అభిప్రాయాలు తెలియజేయాలని జాయింట్ కలెక్టర్, సర్వేపల్లి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఆర్.కూర్మనాథ్ తెలిపారు. మండల కేంద్రమైన వెంకటాచలం తహసీల్దార్ కార్యాలయంలో సర్వేపల్లి నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జేసీ మంగళవారం ఉదయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళవారం ఓటర్ల జాబితాకు సంబంధించి సమావేశం నిర్వహిస్తామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కృష్ణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నారులు బడికి వెళ్లాలి



బుచ్చిరెడ్డిపాళెం : ప్రతి చిన్నారి బడికి వెళ్లాలని వవ్వేరు సచివాలయ మహిళా సంరక్షకులు ఆమని అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు సచివాలయ పరిధిలో పాఠశాలలకు వెళ్లని పిల్లలను ఆమె మంగళవారం గుర్తించారు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లలను పాఠశాలలకు పంపాలని సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొందరు తల్లిదండ్రులు వారి పిల్లలను బడికి కాకుండా పనులకు తీసుకెళ్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీంతో ప్రత్యేక నిఘా ఉంచి బడిఈడు పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించే విధంగా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు వెల్లడించారు.

పైపుల ఆటో దగ్ధం



పొదలకూరు : పట్టణంలోని నెల్లూరు మార్గంలో ఉన్న శ్రీవెంకటేశ్వర పీవీసీ పైపుల కంపెనీ వద్ద లోడుతో ఉన్న ఆటో సోమవారం రాత్రి దగ్ధమైంది. యజమానుల కథనం మేరకు వివరాలు.. పైపుల లోడుతో ఉన్న ఆటోను కంపెనీ ప్రాంగణంలో ఉంచారు. మరుసటిరోజు మంగళవారం వెళ్లి చూడగా పైపులతో సహా ఆటో పూర్తిగా దగ్ధమైంది. ఆటో కాలిపోవడానికి కారణాలు తెలియడం లేదని వారు వెల్లడించారు. ఆటో రూ.1.50 లక్షలు, పైపులు రూ.లక్ష కలిపి మొత్తం రూ.2.50 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు పేర్కొన్నారు.

పరుగు పందెంలో స్వర్ణ పతకం



ముత్తుకూరు : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదివే ఎస్‌కే రేష్మా అనే దివ్యాంగురాలు పరుగు పందెంలో బంగారు పతకం సాధించింది. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక అవసరాల పిల్లలకు నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడల పోటీల్లో రేష్మా ప్రతిభ చాటింది. పరుగు పందెంలో ప్రథమ స్థానం, సాఫ్ట్ బాల్‌లో ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం చల్లా శ్రీనివాసులురెడ్డి, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ స్రవంతి ఇతర ఉపాధ్యాయులు రేష్మాను అభినందించారు.

వాహనం ఢీకొని యాచకుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి నగర పంచాయతీ పరిధిలో మంగళవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యాచకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం శివారులోని టోల్‌ప్లాజా వద్ద మంగళవారం వేకువ జామున గుర్తుతెలియన వాహనం ఢీకొనడంతో 54 ఏళ్ల యాచకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రణాళికబద్ధంగా ఓటరు నమోదు


మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో ఓటు నమోదు ప్రక్రియను ప్రణాళికబద్ధంగా చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఎన్నికల అధికారులు, సూపర్‌వైజర్లతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయాలని కోరారు. తమకు కేటాయించిన ప్రాంతాల్లో ఇంటింటి సర్వేను బీఎల్‌ఓలు కచ్చితంగా చేపట్టాలని సూచించారు. 6, 7, 8వ ఫారాలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఒక డోర్ నంబర్‌పై ఎంత మంది ఓటర్లు నమోదయ్యారో విచారణ జరిపి, సరైన వివరాలనే నమోదు చేయాలని పేర్కొన్నారు. సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు తమ పరిధిలో 300 గృహాల్లో సర్వేను రోజూ చేపట్టాలని తెలిపారు. ఏఈఆర్వోలు నిర్మలానందబాబా, దేవీకుమారి, దశయ్య, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

గృహాలను లబ్ధిదారులకు అందజేయాలి

జగనన్న కాలనీల్లో 100 శాతం పూర్తయిన గృహాలను లబ్ధిదారులకు అందజేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో మెప్మా, హౌసింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రూఫ్ పూర్తయిన గృహాలకు వడ్డీ లేని రుణాలను స్వయం సహాయక సంఘాల ద్వారా అందజేయాలని సూచించారు. కమ్యూనిటీ ఆర్గనైజర్లతో సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులు సమన్వయం చేసుకొని రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులను పూర్తి స్థాయిలో కల్పించాలని ఆదేశించారు. మెప్మా పీడీ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు చేయూత

వీధి వ్యాపారులు, చిరు వర్తకుల కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పించేందుకు గానూ పీఎం స్వనిధి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని కమిషనర్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బకాయిలను సకాలంలో చెల్లించి మరింత మొత్తంలో రుణాలను పొందాలని తెలిపారు. రుణ మంజూరులో ప్రతిభ చూపిన మెప్మా సిబ్బందిని సత్కరించారు. ఎల్డీఎం ప్రదీప్‌కుమార్, పెంచలయ్య, జరీనా, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత

ప్రత్యేక రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా అంగవైకల్యం ఉన్న వారికి జీవనోపాధిని కల్పిస్తూ గాయత్రికి ఉద్యోగమిచ్చారు. ఈ మేరకు ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. పబ్లిక్ హెల్త్ విభాగంలో విధులను కేటాయించారు.

నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు


స్థానికుల సమస్యలను తెలుసుకుంటున్న అనిల్‌కుమార్

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలో ట్రాఫిక్‌ను ఎలా నియంత్రించాలనే విషయమై త్వరలో ఓ సమావేశాన్ని నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపడతామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 45వ డివిజన్లో గల పొగతోట, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారికి వెంటనే లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొగతోట, బృందావనం ప్రాంతాల్లో డ్రెయిన్ల పనులు ఎక్కడెక్కడ ఉన్నాయో వాటిని పూర్తి చేయాలని అధికారులకు సూచించామని తెలిపారు.

విజయమహల్ గేట్ నుంచి రామలింగాపురం అండర్ బ్రిడ్జి వరకు పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులతో చర్చించామన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి సమావేశాన్ని త్వరలో నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని వివరించారు. స్థానికులు, వైద్యులు సహకరించాలని కోరారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ ముదిరెడ్డి వేదవతి, తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ సోమిరెడ్డి


మాట్లాడుతున్న వెంకటశేషయ్య

నెల్లూరు (దర్గామిట్ట): అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య ఆరోపించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. సోమిరెడ్డి అనుచరుడు బుజ్జినాయుడు మట్టి అక్రమ తవ్వకాలకు సూత్రధారి అని, దీనికి సంబంధించిన ఆధారాలను చూపారు. సోమిరెడ్డి, అతని దొంగ బ్యాచ్ చేతివాటం.. ధనదాహానికి ఓ నిండు ప్రాణం బలైందని తెలిపారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేయడం సబబుకాదని సూచించారు. బుజ్జినాయుడికి చెందిన టిప్పర్ ఢీకొని ఓ బ్యాంక్ ఉద్యోగి మృతి చెందగా, ఏడుగురు గాయపడ్డారని చెప్పారు. ప్రమాదానికి కారణం కాకాణి వర్గమంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన సోమిరెడ్డి తెల్లారేసరికి వాటిని ఎందుకు డిలీట్ చేశారని ప్రశ్నించారు. ప్రమాదానికి కారణం కావడంతోనే సైలెంటయ్యారని, దీనికి ఆయన సమాధానం చెప్పాలన్నారు. టిప్పర్ యజమానైన బుజ్జినాయుడ్ని పోలీసులు విచారిస్తుంటే సీఐకి ఫోన్ చేసి దూషించడం నిజం కాదా.. ఆ సమయంలో పక్కా ప్లాన్‌తో స్టేషన్ నుంచి తప్పించింది నీవు కాదానని ప్రశ్నించారు. మట్టి దొంగలు, దోపిడీదారులకు సోమిరెడ్డి ఆశ్రయం కలిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నెల్లూరు శివప్రసాద్, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు తలమంచి సురేంద్రబాబు, తోటపల్లిగూడూరు మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొత్తూరు విద్యార్థి

ఇందుకూరుపేట : ఆగస్టు 12వ తేదీ నుంచి బుచ్చిరెడ్డిపాళెంలో జరుగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పి.వెంకటేష్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వి.మల్లికార్జున మంగళవారం తెలిపారు. ఈ నేపథ్యంలో వ్యాయామ ఉపాధ్యాయుడు కె.ఆరోరాతో పాటు విద్యార్థి వెంకటేష్‌ను హెచ్‌ఎం అభినందించారు.

చిన్నారి అపహరణకు యత్నం

కొడవలూరు : ఊయలలో నిద్రిస్తున్న ఎనిమిది నెలల చిన్నారిని అపహరించేందుకు యత్నించిన ఘటన కొడవలూరు మండలంలోని రాజుపాళెందిన్నె వద్ద మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రాజుపాళెం దిన్నెకు చెందిన శ్రీలిఖిత అనే ఎనిమిది నెలల చిన్నారిని బుచ్చి మండలం ఇస్కాపాళెనికి చెందిన లక్ష్మి (రమణమ్మ) తీసుకెళ్తుండగా, స్థానికులు గుర్తించారు. వెంటనే ఆమెకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈమె గతంలో ఇలాంటి చర్యలకు పాల్పడినట్లు ఎస్సై సుబ్బారావు తెలిపారు.

సీ ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్ల ఆవిష్కరణ



ఆత్మకూరు: నెల్లూరులో ఈ నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించే సీ ఫుడ్ ఫెస్టివల్ వాల్‌పోస్టర్లను ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తన నివాసంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి టి.శ్రీనివాసులు, సాగరమిత్ర రేష్మాపర్వీన్ సీఫుడ్ ఫెస్టివల్ గురించి వివరించారు. పోస్టర్ల ఆవిష్కరణ అనంతరం ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ మత్స్య ఉత్పత్తుల డొమెస్టిక్ మార్కెటింగ్‌ను ప్రోత్సహించడానికి మత్స్యశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సీఫుడ్ ఫెస్టివల్స్‌ను నిర్వహిస్తుందన్నారు. నెల్లూరులో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఫెస్టివల్‌లో సముద్ర ఉత్పత్తులైన చేపలు, రొయ్యలు, పీతలతో తయారు చేసిన పలు రకాల వంటకాలు, మాంసాహార ప్రియులకు కనువిందు చేయనున్నట్లు ఆయన తెలిపారు. మత్స్యకారులను ప్రోత్సహించేందుకు సీ ఫుడ్ ఫెస్టివల్ వంటి వాటిని ప్రోత్సహించాలని ఆయన కోరారు.

యువకుడిపై హత్యాయత్నం

- సమీపై కేసు నమోదు
- జిల్లా కేంద్ర కారాగారానికి తరలింపు


సమీని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): పాత గొడవలను మనస్సులో పెట్టుకొని యువకుడిపై హత్యాయత్నం చేసిన ఘటనలో కోటమిట్టకు చెందిన రౌడీషీటర్ సయ్యద్ హసన్ అహ్మద్ హుస్సేనీ అలియాస్ సమీపై హత్యాయత్నం కేసును దర్గామిట్ట పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రొట్టెల పండగలో గంధ మహోత్సవం రోజున నెల్లూరు వారధి సెంటర్‌కు చెందిన నదీముద్దీన్.. సమీ మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. నదీముద్దీన్, అతని స్నేహితులను చంపుతానని సమీ బెదిరించారు. అప్పటి నుంచి అదను కోసం వేచిచూడసాగారు. ఈ నేపథ్యంలో నదీముద్దీన్ తన స్నేహితులతో కలిసి కిమ్స్ హాస్పిటల్ నుంచి దర్గా వద్దకు ఆదివారం వస్తుండగా, అంబేడ్కర్‌నగర్ వద్ద సమీ దాడి చేసి కత్తితో చంపేందుకు యత్నించారు. తప్పించుకొని పరారైన నదీముద్దీన్ దర్గామిట్ట పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో హత్యాయత్నం కేసును నమోదు చేశారు. నిందితుడు సమీని అరెస్ట్ చేసేందుకు దర్గామిట్ట పోలీస్ అధికారులు తమ సిబ్బందితో కలిసి ఆయన ఇంటి వద్దకు మంగళవారం వెళ్లారు. పోలీస్‌స్టేషన్‌కు రావాలని కోరగా, ఆయన నిరాకరించారు. పోలీసులు చెప్తున్నా పట్టించుకోకుండా ఇంట్లోకి వెళ్లి తలుపులేసుకున్నారు. అక్కడికి చేరుకున్న పలువురు సమీ మద్దతుదారులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హుటాహుటిన ఆయన ఇంటి వద్దకు చేరుకొని పరిస్థితిపై చర్చించారు. అనంతరం 11 గంటలకు స్టేషన్‌కు వస్తారని పోలీస్ అధికారులకు ఎమ్మెల్యే చెప్పారు.

పోలీసులపై కోటంరెడ్డి బెదిరింపు చర్యలు

సమీని 11 గంటలకు దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్టేషన్ వద్దకు చేరుకున్న ఆయన మద్దతుదారులు లోపలికి వెళ్లేందుకు యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మరికొందరు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. లోపలికి వెళ్లేందుకు యత్నించగా, విచారణ అనంతరం వెళ్లాలని పోలీస్ అధికారులు సూచించారు. దీంతో అసహనంతో కోటంరెడ్డి ఊగిపోయారు. తాము అప్పటి వరకు ఉండాలా.. తామేమైనా ఖాళీగా ఉన్నామా.. ఆర్నెల్లో అధికారం తమదేనని, ఆపై మీ బాగోతం ఉంటుందని పోలీస్ అధికారులపై తీవ్రస్థాయిలో బెదిరింపు చర్యలకు పాల్పడ్డారు.

14 రోజుల రిమాండ్

విచారణ అనంతరం సమీని పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపర్చగా, నిందితుడికి 14 రోజుల రిమాండ్‌ను విధించారు. దీంతో పోలీసులు ఆయన్ను జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదు


ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్

నెల్లూరు సిటీ: పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ వికాస్ మర్మత్ స్పష్టం చేశారు. 35వ డివిజన్లోని పొదలకూరు రోడ్డు, సారాయి అంగడి కూడలి, తదితర ప్రాంతాల్లో చెత్త సేకరణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పొదలకూరు రోడ్డులో చెత్త సేకరణలో నిర్లక్ష్యంపై శానిటరీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి అలసత్వం వహిస్తే షోకాజ్ నోటీస్‌ను జారీ చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఫంక్షన్ హాళ్ల వద్ద వ్యర్థాలను రోడ్లపై వేయకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. దుకాణాల ఎదుట తడి, పొడి చెత్త కుండీలను తప్పక ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సహిత విద్య విద్యార్థులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. సహిత విద్యార్థులను అన్ని విధాలా ప్రోత్సహించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టడాన్ని అభినందించారు. సహిత విద్యార్థులకు ఎలాంటి సమస్యలున్నా, తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం డీఈఓ గంగాభవానీ మాట్లాడారు. జిల్లాలోని 38 మండలాల్లో భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగ పిల్లలను గుర్తించి వారికి అవసరమైన ఏర్పాట్లను సమగ్ర శిక్ష ద్వారా చేస్తున్నామని పేర్కొన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. సహిత విద్య సమన్వయకర్త ధనమ్మ, అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా నారద జయంతి


సత్కారం పొందిన జర్నలిస్టులతో నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): నారద జయంతిని నెల్లూరు సాహితీ సుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పప్పులవీధి సమీపంలోని జేసీస్ భవన్‌లో ఫౌండేషన్ నిర్వాహకులు, ఆరెస్సెస్ జిల్లా ప్రచార ప్రముఖ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ ప్రసార మాధ్యమాలకు చెందిన జయప్రకాష్, వెంకటేశ్వర్లు, అల్లూరు రహీం, మురళీకృష్ణ, శంకర్‌ను సత్కరించారు. నెల్లూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రామకృష్ణ, సుధాకర్‌రావు కస్తూరి, శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా వాసు, తదితరులు పాల్గొన్నారు.

సింహపురిలో శాంతి ర్యాలీ



నెల్లూరు(దర్గామిట్ట): మణిపూర్‌లో పరిస్థితులను చక్కదిద్దేలా చర్యలు చేపట్టాలని నెల్లూరు జిల్లా క్రైస్తవ సమాఖ్య వేదిక నేతలు కోరారు. ఈ మేరకు నగరంలో శాంతి ర్యాలీ, నిరసన ప్రదర్శనను మంగళవారం నిర్వహించారు. ఎండీ ప్రకాశం, డేవిడ్ దయాసాగర్, సురేంద్రబాబు, రాజశేఖర్ దాసరి, లూథర్ శామ్యూల్, హనోక్, అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


సమస్యలను ఆరాతీస్తున్న స్రవంతి

నెల్లూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. 12వ డివిజన్లోని సాత్‌రాజుపాళెంలో మంగళవారం పర్యటించిన ఆమె స్థానికుల సమస్యలను ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలను అర్హులకు అందించాలని సూచించారు.

ఉపకార వేతనాలకు నమోదు చేసుకోవాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర ప్రభుత్వం అందజేయనున్న ఉపకార వేతనాలకు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్లో నమోదు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి నిర్మలాదేవి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల ఐఎన్వోలు, హెచ్ఓఐ అధికారుల బయోమెట్రిక్‌ను జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి సమక్షంలో జరపాల్సి ఉంటుందని చెప్పారు. వివరాలకు 95506 71871, 98480 71771 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

శేషజీవితాన్ని హాయిగా గడపాలి



నెల్లూరు(క్రైమ్): ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది తమ శేషజీవితాన్ని హాయిగా గడపాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి కాంక్షించారు. గూడూరు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్న వేణు ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఆయన్ను ఎస్పీ మంగళవారం సత్కరించారు. ఏఎస్పీ హిమవతి, ఆర్‌ఐ పాల్‌రాజు, పీ సెక్షన్ సూపరింటెండెంట్ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



నెల్లూరు(క్రైమ్): వెల్ఫేర్ విభాగంలో హోంగార్డుగా పనిచేస్తున్న రాజేష్ మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన కుటుంబానికి చేయూతనందించేందుకు గానూ జిల్లాలోని హోంగార్డులు తమ ఒక రోజు వేతనం రూ.3,86,950ను సమకూర్చారు. ఈ మొత్తాన్ని మృతుడి భార్య శిరీషకు చెక్కు రూపంలో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి అందజేశారు. ఏఎస్పీ హిమవతి, ఆర్‌ఐ పాల్‌రాజు, పీ సెక్షన్ సూపరింటెండెంట్ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు



నెల్లూరు(దర్గామిట్ట): వీఆర్‌ఏలకు కనీస వేతనంగా రూ.26 వేలివ్వాలని, పేస్కేల్‌ను అమలు చేసి ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలను మంగళవారం నిర్వహించారు. వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఫరీద్, భాస్కర్, బాషా, సీతమ్మ, అంకయ్య, ప్రసాద్, శీను, తదితరులు పాల్గొన్నారు.